క్లుప్తంగా

ఘనంగా గ్రామోత్సవం



చల్లపల్లి: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం గోవిందమాంబ సమేతుడైన వీరబ్రహ్మేంద్రస్వామిని వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. మండల విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శామీరుపేట సాయిబాబు, ప్రధాన కార్యదర్శి నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, కేశనకుర్తి శరత్‌బాబు, కావూరి రవీంద్ర, అయ్యంకి నాగబ్రహ్మచారి, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కోడూరు: హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ ధర్మాధికారి కుప్పా సుబ్రహ్మణ్య అవధాని బుధవారం తెలిపారు. ఉదయం స్వామి అమ్మ వార్లను పెండ్లి కుమారుడి, పెండ్లి కుమార్తెలుగా అలంకరిస్తామన్నారు. ప్రతి రోజు హోమాలు, పూజలతో పాటు 25న అవభృదోత్సవం, ధ్వజారోహణం, పూర్ణాహుతి, రాత్రికి స్వామివారి పవళింపు సేవతో ఉత్సవాలను ముగుస్తాయని అవధాని చెప్పారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



మచిలీపట్నంటౌన్: ఓటు హక్కు వినియోగించుకోవడం బాధ్యతగా తీసుకోవాలని కోరుతూ డ్వాక్రా మహిళలు బుధవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. కోనేరుసెంటరు నుంచి బస్టాండ్ సెంటరు వరకు ఈ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని మునిసిపల్ ఇంజినీర్ సాంబశివరావు జెండా ఊపి ప్రారంభించారు. నా ఓటే నా భవిష్యత్తు, ఓటు వేయటం నా బాధ్యత, ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలి, బుల్లెట్ కంటే బ్యాలెట్ బలమైనది అని నినదిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కెఈవీ బసవేశ్వరరావు, సీవోలు, ఆర్పీలు, డ్వాక్రా సంఘ మహిళలు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు వందనం

పెడన: పురపాలక సంఘ పరిధిలోని వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని గురువారం ఉదయం నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వి.ఏసుబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారితో పాటు వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము) హాజరవుతారని పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ కౌన్సిలర్లు హాజరుకావాలని ఆయన కోరారు.

మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులకు పరామర్శ

కృత్తివెన్ను: మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ బుధవారం మండల పరిధిలోని చెరుకుమిల్లి గ్రామానికి విచ్చేశారు. ఇటీవల చెరుకుమిల్లి మాజీ సర్పంచ్ పట్టపు సీతామహాలక్ష్మి అనారోగ్యంతో మరణించారు. ఆమె భర్త రాధాకృష్ణతో పాటు వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పట్టపు నాగేశ్వరరావు, పట్టపు నాని, మాజీ సర్పంచ్ పట్టపు ప్రసాద్, ప్రముఖ ఆక్వా కంపెనీ యాజమాని పట్టపు బాలాజీ తదితరులు ఉన్నారు.

నేడు అధికారుల కో - ఆర్డినేషన్ సమావేశం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపల్లిలో వేం చేసి ఉన్న శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మార్చి 5 నుంచి 13వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. అందులో భాగంగా అధికారుల కో - ఆర్డినేషన్ సమావేశం ఈనెల 22వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఆర్డీఓ అధ్యక్షతన జరుగుతుందన్నారు. మహాశివరాత్రి మార్చి 8న, మార్చి 9న రథోత్సవం వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు హాజరై సూచనలు, సలహాలు అందించాలని ఆలయ ఏసీ కోరారు.

నేడు మండల క్రీడల బహుమతి ప్రదానోత్సవ సభ

నాగాయలంక: మండల స్థాయిలో ఇటీవల ముగిసిన 30వ వార్షిక విద్యా, సాంస్కృతిక, క్రీడా బాలోత్సవంలో భాగంగా బాల, బాలికలు, ఉపాధ్యాయుల క్రీడల్లో విజేతల బహుమతి ప్రదానోత్సవ సభను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ ఆవరణలో గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ, క్రీడల కమిటీ చైర్మన్ టీవీఎం రామదాస్ బుధవారం తెలిపారు. ఉదయం గం.8.30 నుంచి జరిగే సభలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఎమ్మెల్సీలు టి.కల్పలత, కె.ఎస్.లక్ష్మణరావు, జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా, ఇతర ప్రముఖులు హాజరవుతారన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు



చల్లపల్లిలో పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే సింహాద్రి, ప్రజాప్రతినిధులు



మోపిదేవిలో వలంటీర్లతో ఎమ్మెల్యే రమేష్‌బాబు

చల్లపల్లి: చంద్రబాబు మాటలు మోసే ఉద్యోగం అన్నా, పవన్ కళ్యాణ్ అమ్మాయిలను అమ్మేస్తున్నారని విమర్శించినా ప్రతిపక్షాల మాటలన్నీ భరించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ యజ్ఞంలో గ్రామ వలంటీర్లు నిర్విరామంగా శ్రమిస్తూ ప్రశంసలు పొందారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. స్థానిక సీఆర్ వికాస కేంద్రంలో బుధవారం చల్లపల్లి మండల గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి గ్రామ వలంటీర్లకు సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమ 50 ఇళ్లకు ఆత్మబంధువుల్లా గ్రామ వలంటీర్లు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అభినందించారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రతి సంక్షేమ పథకాన్ని గ్రామ వలంటీర్లు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పార్టీలతో, సిఫార్సులతో ప్రమేయం లేకుండా అర్హత ఉన్న అందరికీ అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు శీరం వెంకట సత్యన్నారాయణ(నాని), ఈఓఆర్డీ బూరేపల్లి అశోక్, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డైరెక్టర్ మేరుగు ఝాన్సీలక్ష్మి, సర్పంచ్‌లు తోట శ్రీనివాసరావు, వల్లూరు ఉమా, మాతంగి రమ్య, ఎంపీటీసీలు మోపిదేవి ద్వారకానాథ్, మహమ్మద్ షాహెదా బేగం, వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పఠాన్ కరిముల్లా ఖాన్, పంచాయతీ ఈఓలు మాధవేంద్రరావు, సాంబశివరావు, రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

పార్టీ జెండా ఏదైనా సంక్షేమం ఆపలేదు

మోపిదేవి: పార్టీ జెండా ఏదైనా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలో మోపిదేవి జెడ్పీ పాఠశాల ఆవరణలో బుధవారం సాయంత్రం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ కేంద్రాల ద్వారా అనేక మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి ప్రభుత్వానికి–ప్రజలకు వారధిగా వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసిన ఘనత జగనన్నదన్నారు. అవనిగడ్డలో 50 పడకల డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశామని, చుక్కల భూముల నుంచి 10,116 మంది రైతులకు విముక్తి కల్పించిన జగనన్నను మరోసారి గెలిపించి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించేలా అండగా నిలవాలని కోరారు. ఎంపీడీఓ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మండలంలో 213 మంది వలంటీర్లు ఉండగా, అందులో సేవా రత్న ఐదుగురికి, మిగతా 208 మంది వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులు, నగదు పురస్కారాలు ప్రశంసా పత్రాలు అందించామన్నారు. గ్రామ సర్పంచ్ నందిగం మేరీ రాణి, మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు, ఎంపీటీసీ, ఎస్ఐ వైపీపీ సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం..

ఘంటసాల(అవనిగడ్డ): దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వలంటీర్ సేవలు ఆదర్శనీయమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఘంటసాల కల్యాణ మండపంలో బుధవారం వలంటీర్లకు పురస్కార కార్యక్రమం జరిగింది. ఆరుగురికి సేవా వజ్ర, నలుగురికి సేవారత్న, 240 మందికి సేవా మిత్ర పురస్కారాలను ఎమ్మెల్యే సింహాద్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ఏర్పాటుకు అనేక రాష్ట్రాలు చర్యలు తీసుకుంటున్నాయని, పనికి తగ్గ ప్రతిఫలం ఆశించకుండా మానవతా దృక్పథంతో మీరు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఎంపీడీఓ శేషమాంబ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ తుమ్మల చౌదరిబాబు, ఎంపీపీ వేమూరి రజనీకుమారి, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ పాలనలో గ్రామ స్వరాజ్యం సాకారం



మంగళాపురంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సింహాద్రి, నాయకులు

మంగళాపురం(చల్లపల్లి): మహాత్మాగాంధీ, అంబేడ్కర్ ఆకాంక్షించిన గ్రామ స్వరాజ్యం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సాకారమవుతోందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మంగళాపురంలో రూ.35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో నిర్మించిన జగనన్న విలేజ్ క్లినిక్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లను ఎమ్మెల్యే రమేష్ బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు బుధవారం ప్రారంభించారు. వైఎస్ జగన్‌ను ప్రజలు మరోసారి ఆదరించి గెలిపించాలని కోరారు.

ప్రభుత్వ సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి

చల్లపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రజలకు సబ్సిడీ ధరలకే మెడిసిన్స్ అందించేందుకు ఏర్పాటు చేసిన జనరిక్ మెడికల్ షాపును సద్వినియోగం చేసుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక పీఏసీఎస్ ఆవరణలో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం, ఫార్మాస్యూటికల్ మెడికల్ డివైజెస్ బ్యూరో ఆఫ్ ఇండియా చేపట్టిన కార్యక్రమం ద్వారా పీఏసీఎస్‌లో నూతన జనరిక్ మందుల దుకాణాన్ని బుధవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, వైఎస్సార్ సీపీ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల వ్యవసాయ విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యన్నారాయణ, సర్పంచ్‌లు డొక్కు నాగేశ్వరరావు, వల్లూరు ఉమా, తోట శ్రీనివాసరావు, శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ పేరం నాగిరెడ్డి, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ డైరెక్టర్ మేరుగు ఝాన్సీలక్ష్మి, కేడీసీసీ బ్యాంక్ బీఎం నగరాజకుమారి, పీఏసీఎస్ అధ్యక్షుడు పాగోలు నాగ సీతారామారావు, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి, చంద్ర దుర్గా సాగర్, మల్లంపాటి కుసుమకుమారి, చంద్ర ఆనంద్, పరుచూరి వెంకన్నబాబు, గొరిపర్తి గోపాలకృష్ణ, భాగ్యారావు,జేసీఎస్ మండల కన్వీనర్ యడ్ల జగదీష్, సురేంద్రనాథ్ బెనర్జీ, ఆది రాంబాబు, సత్యాంజనేయ ప్రసాద్, ఎంపీటీసీ మహమ్మద్ షాహెదా బేగం, మోపిదేవి ద్వారకానాథ్, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా అభిషేకాలు



బంటుమిల్లి: మండల పరిధిలోని మల్లేశ్వరం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ కోదండరామస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి ప్రధానమూర్తులకు పంచామృతాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రం పునర్వసును పురస్కరించుకుని కమిటీ సభ్యుల పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పండితులు పవన్, సాయిల వేద మంత్రాల మధ్య అభిషేకం, పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల రామనామ సంకీర్తనతో ఆలయం మారుమోగింది. పూజల్లో కమిటీ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

దివి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కమిటీ ఎంపిక



అవనిగడ్డ: నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన దివి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. స్థానిక ఏ–1మార్టులో జరిగిన కార్యక్రమంలో అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, మోపిదేవి మండలాలకు చెందిన మెడికల్ షాపుల నిర్వాహకులు పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా అవనిగడ్డకు చెందిన వెంకటసాయి మెడికల్ ఏజన్సీస్ నిర్వాహకులు ధన సురేష్‌ను, కార్యదర్శిగా శ్రీనివాస మెడికల్ స్టోర్స్ నిర్వాహకులు ఎం.విజయకుమార్‌ను ఎన్నుకున్నారు. కోశాధికారిగా మోపిదేవికి చెందిన కళ్యాణి మెడికల్ ఏజన్సీ నిర్వాహకులు వి.సుధాకర్, కమిటీ సభ్యులుగా చిట్లా వెంకట చంద్రశేఖర్, నంబూరి రాజేష్, కోడూరు సాయి, అన్నం వెంకట సుబ్బారావును ఎన్నుకున్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

అవనిగడ్డ: స్థానిక సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో బుధవారం సైన్స్ ఫెయిర్(ఎగ్జిబిషన్) నిర్వహించారు. ఎస్‌వీఎల్ క్రాంతి విద్యాసంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక టెక్నాలజీ, పలు రకాల ప్రాజెక్టులు, పలు ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ మాళీ థామస్, ప్రిన్సిపాల్ సిస్టర్ అమలాపుష్పం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శాంతియుత ఎన్నికలకు ప్రజలు సహకరించాలి

గూడూరు: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజల సహకరించాలని గూడూరు ఎస్ఐ ఐ.వీర్రాజు పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎస్ఐ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో గతంలో జరిగిన ఎన్నికల్లో చోటు చేసుకున్న సంఘటనలను సమీక్షించి పోలింగ్ కేంద్రాలను కేటగిరీల వారీగా విభజిస్తున్నామన్నారు. హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటే సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. ఎన్నికలను ప్రశాంతంగా ముగించేలా పోలీస్ శాఖా పరంగా తీసుకోవాల్సిన చర్యలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నామన్నారు.

గూడూరు: పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం ర్యాంపుల ఏర్పాటును తహసీల్దార్ ఎస్.ఎస్.శాంతి పరిశీలించారు. మండల కేంద్రమైన గూడూరులోని పలు పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం రవాణా, వెలుతురు, గాలి, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలపై ఆమె సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లు ఎలాంటి ఇబ్బంది పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీఆర్వో కరీముల్లా, బీఎల్వోలు తేజేష్, వెంకట సాయి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

చల్లపల్లి: ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కళాకారులు ప్రచారం చేశారు. స్థానిక ఏటీఎం సెంటర్‌లో జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ - నివారణ విభాగం సమర్పణలో ఎయిడ్స్, క్షయ, టీబీ వ్యాధుల లక్షణాలు, నియంత్రణ, నివారణ చర్యలపై కళాకారులు ప్రత్యేక కళారూపాల ద్వారా బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఎం.శేఖర్ బాబు కళాకారుల బృందం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహించారు. కళాకారులు వై.వీరయ్య, వై.రవితేజ, ఎం.చిరంజీవి, ఎం.ప్రసాద్, ఎం.కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

బంటుమిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలతో పాటు దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగన్నచెరువు పంచాయతీ శివారు నెహ్రూనగర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. సర్పంచ్ తమ్మినీడు అరుణకుమారి, పాఠశాలకు పలు వస్తువులు బహూకరించిన మునిపల్లి అబ్రహం, వేగేసిన వాసురాజు, పాఠశాల కమిటీ చైర్మన్ నడా కల్యాణకుమార్‌లు పాల్గొని ప్రసంగించారు. హెచ్ఎం జి.కె. విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు దాతలను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బెల్టు షాపు నిర్వాహకురాలి అరెస్ట్

కోనేరుసెంటర్: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న మహిళను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. గిలకలదిండికి చెందిన సదరు మహిళ బెల్టు షాపు నిర్వహిస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ఆమె నుంచి 46 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సెబ్ పోలీసులు తెలిపారు.

పీఏసీఎస్ మాజీ చైర్మన్‌కు సతీవియోగం

వక్కలగడ్డ(చల్లపల్లి): వైఎస్సార్ సీపీ సీనియర్ బీసీ నాయకులు, వక్కలగడ్డ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మురాల సాయిబాబుకు సతీవియోగం కలిగింది. బుధవారం ఆయన సతీమణి నాగమల్లేశ్వరమ్మ హఠాన్మరణం చెందారు. ఆమె భౌతిక కాయాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు సందర్శించి నివాళులర్పించారు. సాయిబాబును పరామర్శించి, నాగమల్లేశ్వరమ్మ మరణం పట్ల సంతాపం తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యన్నారాయణ, సర్పంచ్ వల్లూరు ఉమా, పీఏసీఎస్ చైర్మన్ హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, పీఏసీఎస్ సీఈఓ వెంకటేష్, మాజీ సీఈఓ అల్లూరి బాబూరావు, జెడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి, పార్టీ నాయకులు రాజులపాటి శివప్రసాద్ తదితరులు నివాళులర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.భాస్కరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఈడేపల్లి శ్రీనివాసనగర్‌కాలనీ, పంచాయతీరాజ్ కాలనీ, రామ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు



పెదకళ్లేపల్లి పీహెచ్‌సీలో తల్లి, బిడ్డతో వైద్య బృందం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు సులభంగా చేస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యురాలు కె.హారిక తెలిపారు. మండల పరిధిలోని పెదకళ్లేపల్లి పీహెచ్‌సీలో మంగళవారం ఉదయం మేకల నాగశ్రావణి కాన్పు నిమిత్తం హాస్పిటల్‌లో చేరిందన్నారు. డెలివరీకి అన్ని ఏర్పాట్లు చేయడంతో మధ్యాహ్నం 12 గంటల సమయంలో సాధారణ కాన్పు ద్వారా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిందని బుధవారం తెలిపారు. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారన్నారు. జననీ శిశు సురక్షా పథకం కింద డిశ్చార్జి అయ్యే వరకు భోజనం, రూ.1,000లు తల్లి బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తామన్నారు. తల్లి, బిడ్డా ఎక్స్‌ప్రెస్ పథకం ద్వారా ప్రభుత్వ వాహనంలో క్షేమంగా ఇంటికి చేరుస్తామని డాక్టర్ హారిక చెప్పారు. డాక్టర్ శ్రీరాం సాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక నిధులతో ముమ్మరంగా అభివృద్ధి పనులు



పనులను ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కేటాయించిన ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 3, 8, 47, డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి బుధవారం శంఖుస్థాపన చేశారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీఎం వైఎస్ జగన్‌ను కోరిన వెంటనే రూ.20 కోట్లు ప్రత్యేక నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో రూ. 3 కోట్ల మేర పనులు ప్రారంభించామన్నారు. డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, 8వ డివిజన్ కార్పొరేటర్ శ్రీరాం చిన్నా, 47వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గౌర శ్రీహరి, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ జోగి రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జి, పలువురు కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

శక్తి అమ్మవారి సేవలో..

మచిలీపట్నంటౌన్: ఈడేపల్లిలోని శక్తిగుడిలో వేంచేసి ఉన్న కాళికా అమ్మవారిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి మరింత జరగాలని కోరుతూ పూజలు నిర్వహించారు.

ఖో ఖో జట్టుకు అభినందన



క్రీడాకారిణులతో కలెక్టర్ రాజాబాబు తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం): క్రీడాకారులు ఆయా క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుని మరిన్ని పతకాలు సాధించాలని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ఖో ఖో మహిళా విభాగం జట్టు ద్వితీయ స్థానం పొందడంతో కలెక్టర్ పి.రాజాబాబు ఆయన చాంబర్‌లో క్రీడాకారిణులను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి పోటీల్లో గుడివాడ నెహ్రూచౌక్–3 సచివాలయ పరిధిలోని మహిళా విభాగం ఖోఖో జట్టు ద్వితీయస్థానం సాధించి రూ.3 లక్షల నగదు బహుమతితో పాటు మెమెంటో, మెడల్స్, సర్టిఫికెట్‌ను గెలుపొందటం అభినందనీయమన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఝాన్సీలక్ష్మి, కోచ్‌లు మడక ప్రసాద్, కె.అనూరాధ, ఎన్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ క్రీడాకారులను ఆమె చాంబర్‌లో అభినందించారు.

నాడు - నేడు పథకంతో ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధి



తాళ్లపాలెం హైస్కూల్‌లో తాగునీటిని పరిశీలిస్తున్న నాగార్జున యాదవ్

కోనేరుసెంటర్: ఏపీ రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వసతుల సదుపాయాల కల్పన సంస్థ చైర్మన్ యనమల నాగార్జున యాదవ్ జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం మచిలీపట్నం మండలం తాళ్లపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలను, చిలకలపూడి పాండురంగ మున్సిపల్ హైస్కూల్, మునిసిపల్ గర్ల్స్ స్కూల్(పార్క్)ను సందర్శించారు. సీఎం వైఎస్ జగన్ కృష్ణాజిల్లాలోని 1,075 ప్రభుత్వ పాఠశాలలకు రెండు విడతలుగా 307 కోట్ల రూపాయలను వెచ్చించి నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడుల రూపురేఖలను మార్చారన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ పాఠశాల, ఉయ్యూరు ప్రభుత్వ పాఠశాల, గూడూరు ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి, వారి నుంచి వివరాలు తీసుకున్నారు. ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ రాయన్న, సర్వ శిక్ష అభియాన్ అధికారులు రాంబాబు, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ మెరుగైన వైద్య సేవలు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని పేదలందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. నగరంలోని 5, 17 డివిజన్లలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాలను బుధవారం ఆమె ప్రారంభించారు. వైద్య శిబిరాల్లో పలు విభాగాల డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమాలను డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, ఆయా డివిజన్ల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్‌లు వేముల వనబాబు, పల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

సమన్వయంతో అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ రాఘవరాణి, ఎంపీడీఓ శ్రీనివాస్

నాగాయలంక: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ రాఘవరాణి పేర్కొన్నారు. ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఎంపీడీఓ సీహెచ్.శ్రీనివాస్ నిర్వహించారు. సభ్యుల సూచనలను పరిగణలోకి తీసుకుని అవసరమైన చర్యలకు జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. సమావేశం ఆరంభం కాగానే టీడీపీకి చెందిన ఐదుగురు సర్పంచ్‌లు, ఇద్దరు ఎంపీటీసీలు బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. బాయ్‌కాట్ చేస్తున్నట్లు గాని, డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రం గాని తమకు ఇవ్వలేదని ఎంపీడీఓ శ్రీనివాస్ చెప్పారు. మండలంలో ఈ ఏడాది రబీ సీజన్‌లో 90 శాతం ఈ క్రాప్ నమోదు పూర్తి చేసి జిల్లాలోనే నాగాయలంక ప్రథమ స్థానం సాధించిందని ఏఓ సంజీవరావు ప్రకటించారు. సీఆర్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మండలంలో ఆరుగురు విద్యార్థులకు ప్రతిభ ఆధారిత ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌లు మంజూరు అయ్యాయన్నారు. మండలంలో సక్రమంగా సాగునీరు అందించామని ఇరిగేషన్ ఏఈ పి.రవితేజ చెప్పారు. విద్యుత్ ఏఈ ఏడుకొండలు, వైద్యాధికారులు ఇంద్రకుమార్ రెడ్డి, శ్యామ్‌ప్రసాద్, మండల పరిషత్ సూపరింటెండెంట్ కె.రామకుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

బంటుమిల్లి: బ్యాంకుల సమాచారం, యాప్‌లు, సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ వీవీఆర్కే సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఇండియన్ బ్యాంకు ఆర్థిక సహకారంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రజలకు బ్యాంకు సేవలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలను చైతన్య పరచేందుకు, ఆర్థిక అక్షరాస్యతను పెంచేందుకు సంస్థ సభ్యులు పని చేస్తారని చెప్పారు. ఈ కేంద్రాలు జిల్లాలో 24 మండలాల్లో ఏర్పాటు చేశామని జిల్లా మేనేజర్ జయవర్ధన సురేంద్ర చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్టు మేనేజర్ వి.అశోక్, రాష్ట్ర సమన్వయకర్త శ్రీనివాసరావు, బ్రాంచి మేనేజర్ జె.అశోక్‌కుమార్, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం డి.శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ బ్రోచర్‌ను బ్యాంక్ అధికారులు ఆవిష్కరించారు.

సవరణ

... 21–2–24న ... ప్రకటనలో ... 110 ... 118–1గా పరిగణించగలరు.